www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



డ్రైనేజీ ప్రధాన కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు చెన్నూరు కొత్త గాంధీనగర్‌లో డ్రైనేజీ ప్రధాన కాలువ పనులను కాంట్రాక్టర్ నీలం వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు జయరామ్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపి అవినాష్ రెడ్డి నిధుల నుంచి రూ. 45 లక్షలతో రాజుల కాలనీ వద్ద నుంచి రైస్మిల్లు నగర్, లక్ష్మి నగర్, యానాదికాలని, గాంధీనగర్ మీదుగా బెస్త కాలనీ ప్రధాన డ్రైనేజీకి కలుపుతామని చెప్పారు. ఇప్పటికే టెండర్ పూర్తయి నీలం వెంకటసుబ్బారెడ్డి దక్కించుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ నీలం వెంకట సుబ్బారెడ్డి స్థానిక వైసిపి నాయకులు చంద్ర, బాబు పాల్గొన్నారు



కడపలో దీక్షలు ప్రారంభిస్తున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మిదేవి

అంగన్వాడీల రిలేదీక్షలు

- ఒంటికాలిపై నిల్చుని నిరసన
- 18వ రోజు కొనసాగిన సమ్మె
- టిడిపి, ప్రజా సంఘాల నాయకుల మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కడప జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా వివిధ రూపాల్లో ఉద్యమం చేపట్టారు. కడప నగరంలో రిలేదీక్షలు చేశారు. కొన్ని చోట్ల మోకాలిపై నిల్చుని వేడుకుని నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

కడప అర్బన్ : అంగన్వాడి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం రూరల్‌లో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వ పరిస్థితి బాగాలేదని అంగన్వాడీలు అర్థం చేసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమన్నారు. జీతాలు పెంచడానికి, సంక్షేమ పథకాల పేరుతో బటన్లు నొక్కడానికి డబ్బులు ఉంటే అంగన్వాడీలకు వేతనాలు పెంచడానికి లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇచ్చిన వాగ్దానాలను గుర్తు తెచ్చుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదా రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకురాలు భాగ్యలక్ష్మి, సిఐటియు నాయకులు అంజనా దేవి, పెద్ద ఎత్తున అంగన్వాడి వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ నాయకులు గంగోత్రి, పద్మ, సావిత్రి, సంధ్యమ్మ కృష్ణవేణి పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నిర్బంధాలతో అంగన్వాడీ ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు. **చెన్నూరు :** సూపర్‌వైజర్ నాగరత్న అంగన్వాడీలను వేధించడం సరికాదని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి, పొర్లు దండాలు పెట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 18 రోలుగా సమ్మె చేస్తుంటే చిన్న మాచుపల్లి సూపర్ వైజర్ నాగరత్న అంగన్వాడీ టీచర్లను, ఆయాలను బెదిరించి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. 'అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని, లేకపోతే మీకు ఉద్యోగాలు ఉండవని' బెదిరిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం నుంచి సూపర్‌వైజర్‌కు ఏమైనా ఆదేశాలు వచ్చాయా అని ప్రశ్నించారు. వర్కర్లకు ఏమైనా జరిగితే సూపర్‌వైజర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అంగన్వాడీలు హక్కుల సాధన కోసం సమ్మె నిర్వహిస్తున్నారని చెప్పారు. వేతనాల పెంపు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు డి.ఎం. ఓబులేసు, అంగ న్వాడీ యూనియన్ నాయకులు పద్మ రెడ్డమ్మ లక్ష్మీదేవి సుబ్బలక్ష్మి బుజ్జి సిఐటియు నాయకులు పరమేష్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** అంగన్వాడీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియ ఽజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా నాడు ప్రతిపక్షనేతగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు తమ ప్రభుత్వం రాగానే తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తానని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పిస్తానని, కనీస వేతనం అమలు చేస్తానని. హెల్పర్లకు ప్రమోషన్లు ఇస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని పూర్తిగా మరిచారని వాపోయారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్మికులు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **చాపాడు :** 18 రోజులుగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో సామరస్యంగా నిరసన దీక్ష చేపడుతున్న అంగన్వాడీలు రోజుకో వినూత్న రీతిలో దీక్షను కొనసాగిస్తున్నారు. శుక్రవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తల మండల నాయకులు సుజాత మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ వేతనాలు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ సిఎం జగనన్నకు అంగన్వాడీ ఉద్యోగులు పోస్టు కార్డులు పంపిణీ చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తూ సిఎం జగనన్నకు పోస్టు కార్డుల్లో తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ రాసి ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా ఎన్ని కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల అంగన్వాడీ మహిళలు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించి విధులకు హాజరు అయ్యేలా చూడాలని కోరారు. సమ్మె కార్యక్రమంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాల్లోని అంగన్వాడీలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో 18వ రోజు నిరసన తెలిపారు . ఆర్‌డిఒ వెంకట రమణకు వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం అంగన్వాడీ సమ్మెకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్ర మంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్, జనసేన పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాసులు, జనసేన బద్వేల్ నియోజకవర్గ కో- ఆర్డినేటర్ నంద కిషోర్, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, బద్వేల్ డివిజన్ ఇన్‌ఛార్జి తుడుమెల్ల మురళి, శ్రీనివాసులు, నాయకులు కార్యకర్తలు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం విజయమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి మేరీ పోరుమామిళ్ల అంగన్వాడీ అధ్యక్షులు దస్తగిరిమ్మ ,సెక్టార్ లీడర్లు రేణుక, జ్యోతి ,లక్ష్మీదేవి, శ్రీదేవి ,రమాదేవి ,అంజనాదేవి, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద 18 రోజులుగా సిఐటియు, ఎఐటియుసి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చలించడంలేదని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయకుమార్, ఎఐటియుసి నాయకులు మంజుల పేర్కొన్నారు. 18వ రోజు సమ్మెకు టిడిపి నాయకులు సి.ఎం. సురేష్ నాయుడు, ముక్తియార్, ఇ.వి. సుధాకర్‌రెడ్డి అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే మీరు ఎన్ని రోజులు అయితే సమ్మెలో కూర్చున్నారో అన్ని రోజులకు జీతాలు ఇస్తామని చెప్పారు. రోజూ 500 మందికి సమ్మెలో ఉన్న వారికి భోజనాలు పంపిస్తామన్నారు. కార్యక్ర మంలో అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బ లక్ష్మి, సెక్టార్ లీడర్లు రాజీ, నాగలక్ష్మి, రాణి, నిర్మల, కృష్ణవేణి, లక్ష్మీదేవి ఎఐటియుసి విజయమ్మ, అర్బన్ సెంటర్ల అంగన్వాడీలు పాల్గొన్నారు. **బద్వేలు :** అంగన్వాడీ వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త సమ్మె 18వ రోజులో భాగంగా శుక్రవారం స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు కోడూరు సుభాషిని, ప్రధాన కార్యదర్శి ఆర్.హుస్సేనమ్మ పూలమాలలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాళ్లు మోక్షమ్మ, బాలమ్మ, సిఐటియు పట్టణ కో-కన్వీనర్ పి.సి.కొండయ్య, నాయకులు రాజగోపాల్, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు షేక్ ఆదిల్, జీవి రమణారెడ్డి, పెద్ద ఎత్తున అంగన్వాడి వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.



బద్వేల్ : దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు



చెన్నూరు : ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

- 4వ రోజుకు చేరుకున్న మున్సిపల్ కార్మికుల సమ్మె
- ఉరితాళ్లు బిగించుకుని, సాష్టాంగ నమస్కారం చేస్తూ వినూత్నంగా నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికులను మోసం చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కంచుపాడు తిరుపాల్ హెచ్చరించారు. శుక్రవారానికి సమ్మె నాలుగో రోజు చేరుకుంది. తమ న్యాయ మైనా డిమాండ్ పరిష్కారం కోసం కార్పొరేషన్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సుంకర కిరణ్ అధ్యక్షతన వినూత్నంగా కార్మికులు సాష్టాంగ నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. కార్యమనికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్ధసారథి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీయతం రెడ్డి, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, నగర అధ్యక్షులు సంకర రవి, తిరుపల్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యో గులను, కార్మికులను, రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. సమానపనికి సమాన వేతనం, ఎలక్ట్రిషన్ సిబ్బందికి స్కిల్డ్,సెమీ స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని కోరారు. డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మికుల పట్ల మొండి వైఖరి వీడి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో 30,31నుంచి అత్యవర సేవలు, అయిన నీటి సరఫరా, లైటింగ్, బిల్ కలెక్ట్, కంప్యూటర్ పనులు నిలిపివేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ఆనంద్, కిరణ్ కుమార్, శ్రీధర్ బాబు, అదాం, ఆనంద్,శివ, మహిళకార్మికులు పాల్గొన్నారు. **మైదుకూరు :** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, మొండి వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్మికులు ఉరితాళ్లతో తమ నిరసన తెలియజేశారు. శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు మెడకు ఉరితాళ్లు చుట్టుకొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, సిఐటియు ట్రెజరర్ జి. చిన్న, లక్ష్మయ్య, వెంకట సుబ్బయ్య, పుల్లమ్మ, విశ్వనా థం పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ కార్మికులు మెడకు ఊరి తాళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులందరూ నిరవధిక సమ్మె 3 రోజు కొనసాగుతుందనీ అన్నారు.జగనన్న పాదయాత్ర లో ఇచ్చిన హామీలను అమలు చేయాల న్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు .సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అని తెలిపారు .కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు ట్రెజరర్ శివ, కమిటీ సభ్యులు చెన్నయ్య, యాకోబు, ఏసమ్మ, ప్రభావతి, జయలక్ష్మి పాల్గొన్నారు **బద్వేలు :** మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 4 రోజులో భాగంగా స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటూ మెడకు ఊరితాళ్ళు బిగించుకొని తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు కాలువ నాగేంద్రబాబు, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, కార్మికులు కాలువ చిన్నరాజు, దియ్యాల మైఖేల్, దియ్యాల రామకృష్ణ, భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ ఆదిల్, జీవి రమణారెడ్డి, వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు గంప సుబ్బరాయుడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి.సి.కొండయ్య, యూనియన్ కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు : మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు



కడప కార్పొరేషన్ ఎదుట పొర్లు దండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు

బాధితులకు న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-చెన్నూరు

కడప -కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని, వారికి త్వరలోనే ఇంటి పట్టాలు అందజేస్తామని ఆర్‌డిఒ జి.ఆర్. మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కనపర్తి గ్రామ పొలాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, బాధితులకు సంబంధించిన సమస్యలను, జాతీయ రహదారిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల గురించి ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్పందించిన ఆర్‌డిఒ కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు జాతీయ రహదారి కొత్త రోడ్డు వద్ద గల సమస్యలను, రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయిన బాధితులకు ఇంటి స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కనపర్తి లేఅవుట్లలో స్థలాలను పరిశీలించామని పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులు 256 మంది ఉండగా, స్థానికంగా 76 మంది లేరని మిగిలిన 180 మందికి ఇంటి స్థలాలు కేటాయిస్తామని వివరించారు. ఇందుకు సంబంధించిన లేఅవుట్ కూడా తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓంనిటిపి రఘురాం రెడ్డి, తహశీల్దార్ పఠాన్ అలీ ఖాన్, సర్వేయర్ సోమశేఖర్, హౌసింగ్ ఎఇ మేనిల్, ఆర్ఐ, విఆర్ఒలు పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న ఎంపిపి

కార్మికుల కష్టాలు తీర్చండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రాక ముందే పోరాటాలు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యురాలు జమీల డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని నకాష్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజులుగా జిల్లాలో అనేక రంగాలకు చెందిన కార్మికులు సమరశీలంగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. కార్మిక వర్గం గొంతెమ్మ కోరికలు కోరలేదని, వారి కోరికలు తీర్చేందుకు తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ అతి తక్కువ సమయంలో వచ్చే అవకాశాలు, సూచనలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక వర్గాన్ని నుంచి బయటకు నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్, డిఎ తదితర బకాయి లన్నిటిని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికార పార్టీ నాయకులు అపద్ధాలు చెప్పడం మాని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని కార్మికవర్గం వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కారం చేసేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికవర్గం చేసే పోరాటాల్లో సిపిఎం ప్రత్యక్ష పోరాటంలో భాగస్వామ్యం అవుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా సంబంధిత మంత్రులు జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేసే దిశగా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.

స్టడీ మెటీరియల్ అందించాలి : 'రూట'

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ఎస్ఎస్‌సి విద్యార్థులకు మైనారిటీ సంక్షేమ శాఖ విభాగం సిఇడిఎం ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్‌బాల్ కోరారు. శుక్రవారం డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధం కోసం స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగ పడుతుందని, వీలైనంత త్వరగా అందించాలని కోరారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న ఎస్ఎస్‌సి మెటీరియల్ ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. వారం లోపు ఎస్-ఎస్‌సి మెటీరియల్ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు షాహిదుల్లా, ముహమ్మద్ అయ్యూబ్ , సయ్యద్ సిరాజుద్దీన్, అఫ్జల్ బాషా, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

'బలిజలకు ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా?'

కడప : 'బలిజలకు వైసిపి ప్రభుత్వం ఏం చేసిందో... టిడిపి ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమా' అని వైసిపి పార్టీ బలిజ నాయకులు తోట కృష్ణ, రాము, పత్తి రాజేశ్వరి, సుదర్శన్ రాయల్, శివ కేశవ, సుబ్బయ్య, మల్లేశ్వరి, ఉమామహేశ్వరి, సింధు, రామకృష్ణ, కార్పొరేటర్లు రెడ్డి ప్రసాద్, కిరణ్ సవాల్ విసిరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కడపలో ఏ ఒక్కరికైనా పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. టిడిపి, బలిజ కులస్తులకు హరిప్రసాద్ ఏమి చేశారో స్పష్టం చేయాలన్నారు. ఒక కులానికి, ఒక పార్టీకి అంటగట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. టిడిపిలో ఎంతో మంది బలిజలను తొక్కేసిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. చివరికి హరిప్రసాద్ సైతం టిడిపి చేస్తున్న కుటిల రాజకీయాల్లో బలయ్యారనేది అనేది నిజమా కాదా స్పష్టం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి తరపున నిలబడే ఏ అభ్యర్థికైనా బలిజ కులస్తులు మద్దతుగా ఉండి గెలిపిస్తారని స్పష్టం చేశారు.

'అభివృద్ధి చేసి చూపిస్తా'

కడప అర్బన్ : ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని సంఘ సేవకులు, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ సలావుద్దీన్ కోరారు. శుక్రవారం రాజా ఖాన్ బాగ్ మసీదు వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం పోరాడే వ్యక్తిని అని పేర్కొన్నారు. పార్టీ గుర్తులతో గెలిచిన ఏ ఒక్కరు ప్రజలకు న్యాయం చేయడం లేదని తెలిపారు. వారి స్వార్థం కోసం పనిచేస్తున్నారని, దీనివల్ల ప్రజలకు ఎటువంటి లాభం ప్రయోజనం లేదని చెప్పారు. అందుకే తాను ప్రజల తరపున ప్రజా సమస్యలపై పోరాటానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ ఎన్నికల పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రతా చర్యలు పటిష్టం చేయాలి : జెసి

కడప : రోడ్డు భద్రత చర్యలను పటిష్టం చేసేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని జెసిజి.గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని, మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. కార్యక్ర మంలో రోడ్డు భద్రతా సమన్వయ కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్అండ్‌బి డిఇ మాధవి, ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, పిఆర్, విద్యుత్ శాఖల ఎస్ఇలు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్టాపన

కడప సిటీ : వీరపునాయునిపల్లి మండలం వెల్దుర్తిలో శ్రీ చౌడేశ్వరి దేవి నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ చౌడేశ్వరి దేవి విగ్రహానికి మూడు రోజులుగా విశేష పూజలు నిర్వహించి అర్చకులు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. పురోహితులు సిద్ధవటం ఉమా మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శిఖర, కలశ ,ధ్వజ, సింహ వాహన ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు గోవిందు నాగరాజు, సిఆర్ఐ సునీల్ కుటుంబ సభ్యులు గజపూల మాలలు శ్రీ చౌడేశ్వరి దేవికి సమర్పించారు. చుట్టపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిగండ్ల కొండ్రాయుడు, గుజ్జుల గంగా ప్రవీణ్ ,వెలిగండ్ల సీతారామయ్య, వెలిగండ్ల కొండలరావు, గుజ్జుల గంగిశెట్టి , పల్లా నరసింహారావు, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యా సుధాకర్, ప్రొద్దుటూరు శ్రీ చౌడేశ్వరి దేవి తోటవీర క్షత్రియ కళ్యాణ మండపం బండారు రఘురామయ్య, అహోబిలం తొగట వీర క్షత్రియ అన్నదాన సత్రం అధ్యక్షులు పల్లాశేషయ్య ,సంగీనాథం ఆంజనేయులు, టేకూరి పుష్పాంగద, పల్లా వాగేష్, గాలి రవి, పట్టుపోగుల సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి : కలెక్టర్

కడప : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఆర్థిక భారం కాకూడదని 'జగనన్న విద్యా దీవెన' పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గ కేంద్రం బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా.. 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించి 4వ విడత విద్యా దీవెన లబ్ది మొత్తాన్ని ల్యాప్ టాప్ బటన్ నొక్కి అర్హులయిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. కడప కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజుతోపాటు ఎపి హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు పి.శివ ప్రసాద్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ యానాదయ్య, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బి. విజయలక్ష్మి, కేంద్ర మిషన్ శక్తి కమిషన్ సభ్యురాలు మూలే సరస్వతి హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 38,531 మంది విద్యార్థులకు మంజూరైన లబ్ది మొత్తం రూ. 29,33,98,016ల మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు కలెక్టర్ గౌరవ అతిథులతో కలిసి అందజేశారు.

'బడ్జెట్‌ను సర్వనాశనం చేసిన సిఎం'

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌ను సర్వనాశనం చేశారని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి విమర్శించారు. శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో 25వ డివిజన్ అన్నమయ్య సర్కిల్ నుంచి కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల ధరలను జగన్మోహన్ రెడ్డి పెంచేశారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో అని ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని పేర్కొన్నారు. టిడిపి హామీలను జగన్ కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నన్ను అంతమొందించేందుకు జగన్ కుట్ర : మాజీ ఎమ్మెల్సీ రవి

కడప అర్బన్ : తనను అంతమొందించేందుకు జగన్ కుట్ర పన్నారని, తనకున్న గన్‌మెన్లకు కూడా రద్దు చేశారని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి అన్నారు. శుక్రవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రాణాలకు ఏమాత్రం హాని జరిగినా అందుకు వైఎస్ జగన్, భారతి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి బాధ్యులవుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చుకుంటూ జగన్ పులివెందుల కాక వేరు నియోజకవర్గంలో ఎన్నికల్లో నిలబడితే అక్కడే జగన్ పై పోటీకి తనను దింపాలని చంద్రబాబును కోరతానని చెప్పారు. తాను పాదయాత్రలో చెప్పిన హామీలు 15 శాతం నెరవేర్చి, 95 శాతం నెరవేర్చానని అబద్దాల డబ్బా కొడుతున్నారని విమర్శించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు డిబెట్‌కు వస్తే 15 శాతం పైబడి హామీలు అమలు కాలేదని తాను లెక్కలతో సహా నిరూపిస్తానని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందించిన వైద్యానికి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో, ఇక వైద్యం అందించబోలెమని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాలు చేతులెత్తేశాయని అన్నారు. చంద్రబాబు అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను జగన్ రెడ్డి రద్దు చేశారని మండిపడ్డారు. మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా, మద్యం ఆదాయాన్ని 15 ఏళ్లు బ్యాంకులకు తాకట్టు పెట్టి, నాసిరకం మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, మద్యనిషేధం అంటే ఇదే నా అని ఆయన ప్రశ్నించారు. జగన్ ఇచ్చిన హామీలు 85 శాతం అమలు చేయలేదని ఆధారాల ప్రతులను విడుదల చేశారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

కడప : జిల్లాలో వివిధ రాజకీయపార్టీల నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పెండింగ్ దరఖాస్తుల స్థితి, ముసాయిదా జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అండ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ రాంమోహన్, ఎన్నికల విభాగం అధికారులు హాజరయ్యారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - చాపాడు

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎన్.ఓబాయపల్లె పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసులరెడ్డి తెలిపారు. నక్కలదిన్నె గ్రామంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో నైపుణ్యతగల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పేద క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో పోటీలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికంగా చేయూతనిస్తున్న డాక్టర్ నాగార్జున

అంధుల కుటుంబానికి అండగా..

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంధుల కుటుంబానికి జనసేన తరుపున అండగా ఉంటామని జెఎస్‌పి నియోజకవర్గ కార్యదర్శి నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక దిగువపట్నం కాలనీ మాత వాటర్ ప్లాంట్ వీధిలోని అంధుల కుటుంబానికి జనసేన ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ నియోజకవర్గ అధ్యక్షులు అల్లం సూర్యనారాయణ ఆదేశాల మేరకు తన సొంత డబ్బులతో దన్నవాడ హాజీవల్లి, దన్నవాడ ఆదాంబి ఇద్దరు అన్న చెల్లెళ్లకు ఆర్థికంగా, కుటుంబ పోషణకు రెండు నెలలకు అవసరమయ్యే సరుకులను వితరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాటే తమకు శిరోధార్యమన్నారు.కార్యక్రమంలో జనసేన ప్రోగ్రాం కమిటీ మెంబర్ పవన్‌కుమార్, జనసైనికులు టి.హరినాథ్‌రెడ్డి, ఆవుల వినయ్‌కుమార్, షేక్ మహబూబ్ బాషా, అల్ల బకాష్, షాకీర్ బాషా, సుధాకర్, వలీ, ఆర్.వలీ, పి.విజయరాజు, బిర్రు జాషువ, మంచాల చెన్నయ్య, మట్టేపల్లి కన్నయ్య, జి.రాజశేఖర్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాపాలుగా జగన్ పథకాలు

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి



ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు, విద్యా, వసతి శాపాలుగా మారాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యా ర్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకాలను అటు డిగ్రీ, ఇటు పీజీ విద్యార్థులకు ప్రారంభించిందని తెలిపారు. అమ్మను మమ్మీ అన్నట్లు, నాన్నను డాడీ అన్నట్లు వైసిపి ప్రభుత్వం పై పథకాలకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనని పేర్లు మార్చిందని విమర్శించారు. జిఒ 77 పిజి విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే చిత్తశుద్ధి ఉంటే వెంటనే జిఒ 77ను రద్దు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

కొమ్మలూరులో విషాదం

- పంట నూర్పిడి యంత్రం కింద పడి కూలీ మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంంలోని రావులపల్లె సమీప పొలాల్లో శుక్రవారం మినుము నూర్పిడి యంత్రం కిందపడి కొమ్మలూరు గ్రామానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీ పోతుల వెంకటసుబ్బమ్మ (45) మృతి చెందింది. ఆమె కూలి పనికెళ్లి జీవనం సాగిస్తుంటుంది. రోజూలాగే పనికోసం రావులపల్లె సమీప పొలాలకు వెళ్లింది. మినుము పంట నూర్పిడి యంత్రం వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ యంత్రం బోల్తా పడడంతో.. యంత్రం ఆమెపై పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలం చేరుకుని పరిశీలించారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వెంకటసుబ్బమ్మ మృతితో కొమ్మలూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.



మృతి చెందిన వెంకటసుబ్బమ్మ

వాహనాల తనిఖీ : రూ.49 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రొద్దుటూరు నుండి హైదరాబాద్ వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో ఎలాంటి బిల్లులులేని రూ.49లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బస్సును సోదా చేశారని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

ఘనతను చాటుకున్న రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-కడప అర్బన్



ప్రతిభ చాటిన విద్యార్థులతో జిల్లా అధికారులు

రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన తన ఘనతను చాటుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి మూడు విభాగాలలో 8 అంశాల పైన జిల్లాకు తొమ్మిది ప్రాజెక్టులు చొప్పున ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శింపబడ్డాయి. వ్యక్తిగత విభాగం లో ఒక విద్యార్థి, గైడ్ టీచర్, గ్రూపు విభాగంలో ఇద్దరు విద్యార్థులు, గైడ్ టీచర్ ఉపాధ్యాయ విభాగంలో ఒక ఉపాధ్యాయుడు పాల్గొన్నారు. మొత్తం మూడు విభాగాలలో కలిసి 217 ప్రాజెక్టులు వైజ్ఞానిక ప్రదర్శనలు పోటీపడ్డాయి నువ్వా నేనా అన్నట్టుగా ఉన్న ఈ ప్రదర్శనలు జూరి కమిటీ సభ్యులను సైతం వారి నిర్ణయాన్ని ప్రకటించడంలో సంశయానికి గురి అయ్యారు. విద్యార్థులు వారి ఎగ్జిబిట్లను ప్రదర్శించడంలోను, వాటిని వివరించి చెప్పడంతో విద్యార్థుల వాగ్ధాటికి న్యాయ నిర్ణేతలే ఆశ్చర్య పోయారు. జూలీ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫలితాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో రోజు శుక్రవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా విద్యాశాఖ అధికారి వై. రాఘవరెడ్డి అల్పాహార ఏర్పాటను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయానికి అందించాల్సిన ఆదేశించారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ప్రతి జిల్లా నుంచి వచ్చిన ప్రదర్శనలకు గౌరవంగా సర్టిఫికెట్, జ్ఞాపికలను అందించాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. 26 జిల్లాల నుంచి జిల్లాల వారీగా పిలిచి ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాపరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వై రాఘవరెడ్డి జ్ఞాపికలను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వేదికపైన జనజ్ఞానం వేదికకి సంబంధించిన 'బొకే వద్దు మొక్కేముద్దు' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, శాస్త్రీయ భావాలను పెంపొందించడానికి ఇలాంటి ప్రదర్శనలు చాలా అవసరం అవుతాయని చెప్పారు. వారి విజ్ఞాన పెంపుదలకు దోహదం చేస్తాయని తెలియజేశారు. తరగతి గదిలో విద్యార్థులు వినడం, చక్కగా నేర్చుకోవాలని హితబోధ చేశారు. విజయం సాధించిన ప్రదర్శనలు ప్రదర్శించిన విద్యార్థులను. గైడ్ టీచర్లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రదర్శనలు వ్యయ ప్రయాసలతో సుదూర ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ ప్రదర్శించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, జిల్లా సైన్స్ అధికారులను పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వర్ రెడ్డి దాదాపు పది రోజులగా రాష్ట్రస్థాయి వైజ్ఞాన ప్రదర్శన, తయారీ విజయవంతం చేయడానికి అహర్నిశలు శ్రమించిన వివిధ కమిటీల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు జి. రాజగోపాల్ రెడ్డి, జి. కృష్ణప్ప, జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వర్ రెడ్డి, కడప మండల విద్యాశాఖ అధికారి నారాయణ పాల్గొన్నారు.

'బాధితులకైనా న్యాయం చేయండి'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు నెలల్లో స్టీల్ ప్లాంట్ ఎలాగూ కట్టలేదు.. కనీసం ముంపు బాధితులకైనా పరిహారం చెల్లించి న్యాయం చేయాలని టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పర్యటన జిల్లా ప్రజలకు నిరాశ కలిగించిందన్నారు. ముఖ్యంగా జమ్మలమడుగు ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అవన్నీ నిరాశగా మారాయన్నారు. జగన్‌కు ముఖ్యమంత్రిగా ఇది చివరి పర్యటన అన్నారు. గండికోట, రాజోలి ప్రాజెక్టు, అగ్రిగోల్డ్, ఎసిసి, స్టీల్‌ప్లాంట్ బాధితులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అదానీచే ఎసిసి సిమెంట్ పరిశ్రమను కట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గండికోట టూరిజం అభివృద్ధికి, రోప్ వే నిర్మాణానికి నిధులు కేటాయిస్తారని నియోజకవర్గ ప్రజలు భావించారని, వాటిపై మాట్లాడకుండా వెళ్లిపోవడం బాధాకరమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి బొకేలు ఇచ్చి ఫోటోలు దిగడం తప్ప నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయిన పాపాన లేదన్నారు. కనీసం ఈ మూడు నెలల్లో గండికోట, రాజోలి ప్రాజెక్టు, ఇతర ముంపు బాధితులకు పరిహారం అందేలా ధర్నాలు, రాస్తారోకోలు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీను, బూసిరెడ్డి, ఫిలిప్, నాయకులు పాల్గొన్నారు.

పేదలను సంపన్నులను చేస్తాం : భూపేష్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే పేదలను సంపన్నులను చేస్తామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 11వ వార్డులో శుక్రవారం సాయంత్రం భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ చంద్రబాబు వివిధ పథకాలను హామీలుగా ఇస్తున్నారన్నారు. వాటినే తాము ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వివరిస్తున్నామన్నారు. రైతుకు అన్నదాత కింద రూ.20,000, ఆడబిడ్డ నిధి కింద రూ.18,000, తల్లికి వందనం కింద రూ.15,000, యువగళం నిధి కింద రూ.36,000 వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు టిడిపి సిద్ధంగా ఉందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. స్థానికంగా తనను బలపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జింకల బాషా, కొండయ్య, జనసేన నియోజకవర్గం కార్యదర్శి నాగార్జున, టిడిపి నాయకులు దువ్వూరు మురళి, హనుమంతు, పొన్నతోట శ్రీను, మొరగుడి విశ్వనాథరెడ్డి, పాలూరు సుధీర్‌కుమార్‌రెడ్డి, పెద్దండ్లూరు రామచంద్ర, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు థర్మకూల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆంగ్లంలో రాణించాలనే ఉద్దేశంతో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. బాలికల పాఠశాలను ఇంటర్ అప్ గ్రేడ్ చేయడం జరిగిందని, పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇదే పాఠశాలలో ఇంటర్ కూడా చదవవచ్చున్నారు. సిఎం జగనన్న పుట్టినరోజు వేడుకలను పురష్కరించుకొని ఎంపీ విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయిత్రి, ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనువాసులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను ఆదుకోండి'

ప్రజాశక్తి - దువ్వూరు

సాగునీటి ప్రాజెక్టులైన కెసి కెనాల్, తెలుగుగంగ కాలువలను పూర్తి చేసి జిల్లాలో ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు ప్రధాన ఆయువుపట్టి అయిన రాజోలి, జొలదరాశి సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలన్నారు. ఆ మేరకు బహుజన సమాజ్ పార్టీ, న్యాయ విద్యార్థి విభాగం సభ్యులతో కలిసి తహశీల్దార్ రామకుమారికి వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, నియోజకవర్గ నాయకులు కత్తి నాగిరెడ్డి, సమితి దువ్వూరు మండల కార్యదర్శి సీతారాముడు, న్యాయ విద్యార్థి విభాగం నాయకులు గంగికుంట నాగరాజు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు అజయ్‌బాబు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రైతు నాయకులు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు



కప్ అందజేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యుడు ఎ.వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతలకు మెడల్స్, కప్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు, సిఐటియు ప్రధాన కార్యదర్శి దాసరి విజయ్ ముఖ్య అతిథులుగా ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలిచి ముందుకు సాగిన ఇరు జట్లను అభినందించారు. విజేతగా స్థానిక షిరిడిసాయి జూనియర్ కాలేజ్ విద్యార్థులు రాగా.. రన్నర్స్‌గా ఎస్‌పి జూనియర్ కళాశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి హుస్సేన్ మియా, పవన్, హరిబాబు, సురేంద్ర, ఇషాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, క్రీడా సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

అంగన్‌వాడీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్రస సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో శుక్రవారం వైయస్సార్ టియుసి అంగన్వాడీ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులు మల్లూరి జాషువ సమక్షంలో ఎన్నుకున్నారు. అంగన్వాడీ కమిటీ గౌరవ అధ్యక్షులుగా వైఎస్ మనోహర్‌రెడ్డి, అధ్యక్షురాలుగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ, సలీమాను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నడూ లేని విధంగా అంగన్వాడీలకు ఇచ్చిన మాట ప్రకారం జీతం పెంచారన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

చాపాడు : విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్ సూచించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇస్మాయిల్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి విద్యార్థులే పట్టుకొమ్మలన్నారు. చిన్నతనంలో కష్టపడితే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేందుకు యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్కూల్ కరస్పాండెంట్ వి.జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, మాధవి, నందిత, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవింద్రబాబు, సిబిఐటి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనువాసులరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : అమృత్ పథకం ద్వారా రూ.130 కోట్లు ఖర్చు చేసి ప్రొద్దుటూరుకు తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక బుడ్డాయపల్లెలో పైప్‌లైన్ వేసిన రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు శాశ్విత నీటి పరిష్కారం కోసం మైలవరం డ్యాం నుండి పైప్‌లైన్ ద్వారా రెండు కొళాయిల వద్ద నీటిని శుద్ధి చేసి అక్కడి నుండి ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేసి 41వార్డుల్లోని ప్రజలకు పూర్తిగా ప్రతి ఇంటికి నీరు అందిస్తామన్నారు. బొల్లవరం, బుడ్డాయపల్లె, శ్రీనివాసనగర్‌కు ఇంటర్ కనెక్షన్ చేయాల్సి ఉందన్నారు. మూడు రోజుల్లో ఈ పనులను కూడా పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తామన్నారు. ఎస్‌సిఎన్ఆర్ కళాశాలలో, మౌలానా ఆజాద్‌వీధిలో, భారత్ థియేటర్ వద్ద నూతన ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. వీటితోపాటు 10 పాత ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. చెప్పిన మాట ప్రకారం చేస్తున్నామన్నారు. ఇంత అభి వృద్ధిని చూస్తూ టిడిపి నాయకులు కళ్లులేని కబోదుల్లా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి, పట్టణ వైసిపి అధ్యక్షుడు కామిశెట్టిబాబు, మహిళా అధ్యక్షురాలు సునంద, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, కమాల్ బాషా, అనిల్‌కుమార్, మీగడ చంద్ర, అంజనేయులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్రం బాగుపడాలంటే ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రిలయన్స్ పెట్రోల్ పంప్ నుండి కొత్తపల్లి రింగ్ రోడ్డు సర్కిల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, వెలవలి పద్మనాభరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, ప్రొద్దుటూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిశెట్టి సురేంద్ర, 37వార్డు పొట్టిపాటి గంగాధర్, కృష్ణారెడ్డి, 9వార్డు కరీముల్లా, 8వార్డు సురసుర శ్రీనివాసులు, రాష్ట్ర దేవాంగ కమిటీ సభ్యులు మధుబాబు, పెన్నానగర్ మజీద్, సూరి, రామాజీ ఓబులేసు, మెరువ మూర్తి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తే పులివెందులలో మార్పు తప్పదని నియోజకవర్గ పరిశీలకుడు బుగ్గయ్య చౌదరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. అలా పని చేస్తే 40 ఏళ్ల చరిత్రను తిరగరాయొచ్చన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో తిరుగుబాటు మొదలైందన్నారు. చంద్రబాబు పులివెందులకు వచ్చినప్పటి నుండి నియోజకవర్గంలో 75శాతం మార్పు వచ్చిందన్నారు. ప్రతి కార్యకర్తకు టిడిపి అండగా ఉంటుందన్నారు. నవరత్నాలు నవ మోసాలు పుస్తకాలను తూగుట్ల రాఘవరెడ్డి, ఏసు, మైసూరారెడ్డి, రఘునాథరెడ్డి, బాలస్వామి రెడ్డి, గడ్డం అమర్, నాగిరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, రామగంగిరెడ్డి, అశోక్, కంచిరెడ్డితో కలిసి బుగ్గయ్య చౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జయభరత్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాషా, కాశీం, అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, అక్కులుగారి విజయకుమార్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి ఫోరంలో పాల్గొన్న యువకులు

టిడిపి ఫోరం సమావేశానికి వేంపల్లె యువత

ప్రజాశక్తి - వేంపల్లె

కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన టిడిపి ఫోరం సమావేశంలో వేంపల్లెకు చెందిన టిడిపి యువత పాల్గొంది. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బెంగళూరులోని కెఎంఎం కన్వెన్షన్ హాల్‌లో చేపట్టిన టిడిపి ఫోరం సమావేశానికి వేంపల్లె నుంచి పలువురు టిడిపి కార్యకర్తలు వెళ్లారు. ఈ సందర్భంగా యువతకు పార్టీ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించినట్లు టిడిపి యూత్ సభ్యుడు యాసిన్ తెలిపారు. యువతకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడంతోపాటు రాబోయే 100 రోజులు పార్టీ కోసం పని చేసి ప్రజలకు సుపరిపాలన అందజేసే ప్రభుత్వాన్ని స్థాపించడానికి ప్రతి ఒక్క యువకుడు కృషి చేయాలని కోరారని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం నిర్మించడంలో యువత తమ వంతుగా తీసుకొని ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారని చెప్పారు. సమావేశానికి టిడిపి యవత రాహుల్, గంగాధర్, వంశీ, శేఖర్ వెళ్లారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ శాఖ సిబ్బందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ బకాయి వసూళ్ల కోసం సిబ్బంది వచ్చారని తనకు చెందిన వాటర్ ప్లాంట్ బిల్లు బకాయి ఉండగా చెల్లించానని తెలిపారు. వసూళ్ల కోసం వచ్చిన సిబ్బంది తన పట్ల దురుసుగా ప్రవర్తించి అవమానకరంగా మాట్లాడారని ఆయన ఆరోపించారు. తన సర్వీస్ మీటర్ కాలిపోతే ఆన్‌లైన్ ద్వారా మీటర్‌కు డబ్బులు చెల్లించానని, సంబంధిత శాఖ అధికారులు అవి చెల్లవని మాట్లాడారన్నారు. కొత్త మీటర్ కోసం రూ.5 వేలు అడిగారని ఆరోపించారు. ఈ క్రమంలో తమకు సంబంధించిన సర్వీస్ మాత్రమే తొలగించడం కేవలం కక్ష సాధింపు చర్య అని వాపోయారు. కులం పేరుతో దూషించిన విద్యుత్ సిబ్బందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు చేయాలని గున్నంపాటి వెంకటరమణ కోరారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని అన్ని గ్రామాల రైతులు అక్టోబర్ నుంచి సాగు చేసిన మినుము, జొన్న, మొక్కజొన్న,నువ్వులు ఇతర పంటలను ఆర్‌బికెలో తప్పక ఇ క్రాప్ చేయించుకోవాలని ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆధార్ కార్డు, 1బి, ఫోన్ నెంబర్ తీసుకెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులు దగ్గర నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం వర్షాభావం తక్కువ ఉండడం వల్ల, ఆశించిన దిగుబడులు రాని కారణంగా ప్రభుత్వం నుంచి ఏదైనా పంటల బీమా, పంట నష్ట పరిహారం, మద్దతు ధర వంటి ప్రయోజనాలను పొందవచ్చన్నారు.

జడ్‌పి పాఠశాల వ్యవస్థాపకులు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, మాజీ సర్పంచ్ గూడూరు బాబ్జి తండ్రి గూడూరు రామకృష్ణయ్య(92) వయోభారంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి శుక్రవారం ఉదయం రామకృష్ణయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. చాపాడు హైస్కూల్ నేటికీ జిఎస్ హైస్కూల్ గా రామకృష్ణయ్య పేరున ఉంది. గురువారం రాత్రి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి నివాళులు అర్పించారు. అలాగే గ్రామానికి చెందిన కృష్ణయ్య(77) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



రామకృష్ణయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే